# డ్రగ్స్ నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం అవసరం



**దశ, మహేశ్వరం:** మాదకద్రవ్యాల నిర్మూలనకు చట్టపరమైన చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం అవసరమని మహేశ్వరం జోన్ డీసీపీ కె. నారాయణరెడ్డి (ఐపీఎస్) అన్నారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్'పై పీఐబీ హైదరాబాద్ ఆధ్వర్యంలో మహేశ్వరంలో నిర్వహించిన 'వార్త' మీడియా వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఎస్పీ రావుల గిరిధర్ (ఐపీఎస్), పీఐబీ హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, మహేశ్వరం ఎంపీడీవో ఎన్. శారదమ్మ పాల్గొన్నారు. డీసీపీ కె. నారాయణరెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్ నివారణ చర్యలు ఇళ్లలో, పాఠశాలల్లోనే ప్రారంభం కావాలని, తల్లిదండ్రులు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ ముప్పును ఎదుర్కొనేందుకు ఎస్ఐడీ, ఆక్టోపస్, సీఐఎస్ఎల్, ఈగల్ ఫోర్స్‌తో పాటు స్థానిక పోలీసులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.

ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ.. జనవరి నుంచి తెలంగాణలో దాదాపు 8 వేల కిలోల గంజాయిని ఈగల్ ఫోర్స్ సీజ్ చేసిందని వెల్లడించారు. 22 శిక్షణ కార్యక్రమాల ద్వారా 30 వేల మందికి పైగా పోలీసు, ఇతర శాఖల సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. డ్రగ్స్ కేసుల రిపోర్టింగ్‌లో మైనర్ల వివరాలను గోప్యంగా ఉంచాలని, బాధ్యతాయుతంగా వార్తలు అందించాలని మీడియాను కోరారు. డాక్టర్ మానస్ కృష్ణకాంత్ మాట్లాడుతూ.. డ్రగ్స్ ముప్పు సామాజిక, శాంతిభద్రతలు, జాతీయ భద్రతకు సవాలుగా మారిందన్నారు. కచ్చితమైన సమాచారం, బాధ్యతాయుతమైన రిపోర్టింగ్‌పై జర్నలిస్టులకు అవగాహన కల్పించడమే 'వార్త' వర్క్‌షాప్ లక్ష్యమన్నారు. పీఐబీ హైదరాబాద్ మీడియా కమ్యూనికేషన్ అధికారి వర్గంటి గాయత్రి కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 60 మంది మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



## స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి: ఏబీవీపీ

**దశ, రంగారెడ్డి:** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ను భారీగా ముట్టడించారు. సుమారు 1,500 మంది విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఏబీవీపీ వీరపట్నం జిల్లా కన్వీనర్ జగదీష్ మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా విద్యార్థి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు మల్లకేడి సాయిచరణ్, నేషనల్ కళామంచ్ కోకన్వీనర్ మణికంఠ, విభాగ్ కన్వీనర్ ప్రదీప్, శంషాబాద్ జిల్లా కన్వీనర్ పవన్, గుణవంత్ రెడ్డి, పుష్పల ఆదర్శ్, మహేందర్, భరత్, మైపాల్, రాజేష్, గంగవరం వినయ్, దేవరశెట్టి ప్రణీత్, దండు కార్తీక్, రామ్‌చరణ్, నవదీప్, భరత్ వంశీ, బన్ను, సందీప్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## హఫీజ్‌పేట్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ



**దశ, రంగారెడ్డి:** హఫీజ్‌పేట్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. స్వర్ణ కుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది హాజరు, ఓపీ సేవలు, మందుల లభ్యత, రికార్డుల నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ప్రతి రోగికి సకాలంలో వైద్య సేవలు, అవసరమైన మందులు, ఆరోగ్య సలహాలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అర్బన్ హెల్త్ సెంటర్లు ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని డా. స్వర్ణ కుమారి పేర్కొన్నారు. ఈ తనిఖీలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి అక్రమ్, నేషనల్ హెల్త్ మిషన్ అధికారి డా. జ్యోతి బాయి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కసిరెడ్డి సమక్షంలో రాజ్‌కుమార్ జన్మదిన వేడుకలు



**దశ, కల్వకుర్తి:** చుక్కాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎడవెల్లి గ్రామ యువ నాయకుడు, బీఎల్ఏ గుద్దటి రాజ్‌కుమార్ జన్మదిన వేడుకలు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఎస్ఐఆర్ స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్‌లో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గ స్థాయి బీఎల్ఏలతో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశం అనంతరం కేక్ కట్ చేసి రాజ్‌కుమార్‌కు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ సభ్యులు మైసిగండి శ్రీనివాస్, ఆమనగల్ మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, గూడు శ్రీనివాస్‌రెడ్డి, తలకొండపల్లి యువ నాయకుడు పెరుమాండ్ల సురేష్ తదితరులు రాజ్‌కుమార్‌ను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కాలె అనితరమేష్



**దశ, యాచారం :** ఉప సర్పంచ్‌ల సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా రంగారెడ్డి జిల్లా యాచారం మండలం కొత్తపల్లి గ్రామ ఉప సర్పంచ్ కాలె అనిత-రమేష్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లావుడ్య రాములు నాయక్ ఆమెకు నియామక పత్రం అందించి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా కాలె అనితరమేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన లావుడ్య రాములు నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కులు, అధికారాలు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. తెలంగాణలోని అన్ని గ్రామాల ఉప సర్పంచ్‌లను సంఘటితం చేసి, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఉప సర్పంచ్‌ల సంఘాన్ని రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేసి, హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడుతామని పేర్కొన్నారు. కాలె అనితరమేష్ నియామకంపై కొత్తపల్లి గ్రామ ప్రజలు, ఉప సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



## వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

❖ పీసీసీఎఫ్ వినయ్ కుమార్

**దశ, రంగారెడ్డి :** వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ వినయ్ కుమార్ ఐఎఫ్ఎస్ పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా రంగారెడ్డి జిల్లాలోని MJPTBCWREIS బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ నెలాఖరు వరకు విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతున్నట్లు వినయ్ కుమార్ తెలిపారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా లక్ష మొక్కలు నాటే లక్ష్యంలో భాగంగా ఈ ప్రాంగణంలో 2,200 మొక్కలు నాటినట్లు వెల్లడించారు. ప్రతి విద్యార్థి పుట్టినరోజున కనీసం ఒక మొక్క నాటి, దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటిని సంరక్షించడం అంతకంటే ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో చార్మినార్ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ డా. ప్రియాంక వర్గీస్ ఐఎఫ్ఎస్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశీష్ సింగ్ ఐఎఫ్ఎస్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## నారాయణరావుపేటలో ఘనంగా వన మహోత్సవం



**దశ, దుమ్ముగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం నారాయణరావుపేట గ్రామపంచాయతీ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కల్లూరి ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కుంజా శ్రీనివాస్, ఉపాధ్యాయులు కారం సర్వేశ్వరరావు దొర, మల్లం వెంకటేశ్వర్లు, సరియం వీరయ్య, అటవీ శాఖ అధికారులు డీఆర్‌ఓ అరుణ, ఎఫ్‌బీవో రామకృష్ణ, రాజేష్, విద్యార్థులు, గ్రామస్తులు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

## సుగూర్ ప్రాథమిక పాఠశాలలో.. కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

**దశ, పెబ్బేర్:** విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో సుగూర్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. స్థానిక సర్పంచ్, మండల విద్యాధికారి చేతుల మీదుగా ఈ కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రతీ విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతగానో అవసరమని పేర్కొన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కంప్యూటర్ ల్యాబ్ విద్యార్థుల భవిష్యత్తుకు, విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యతో అనుసంధానం చేయడం ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను మరింత పెంపొందించవచ్చని అభిప్రాయపడ్డారు.



పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం కావడంతో సుగూర్ డిజిటల్ విద్య వైపు మరో ముందడుగు వేసిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## పేకాట స్థావరంపై మెరుపు దాడి..

❖ ఏడుగురు అరెస్ట్

**దశ, హుజురాబాద్:** కరీంనగర్ నగరంలోని శర్మానగర్‌లో పేకాట స్థావరంపై టూటౌన్ పోలీసులు మంగళవారం మెరుపు దాడి చేశారు. ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.7,730 నగదు, 8 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి ఏడుగురిని పట్టుకున్నారు. నిందితులుగా బండ హరిబాబు, బొల్లబత్తిని శ్రీనివాస్, గసిగంటి సంపత్, చెల్లోజు అరుణ్‌కుమార్, రావుల అనిల్‌కుమార్, బుసుమల్ల కిషోర్, చల్లోజు హరికృష్ణలను గుర్తించారు. గేమింగ్ యాక్ట్ నిబంధనల ఉల్లంఘనపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు. అనుమతులు లేని పేకాట, బెట్టింగ్, ఇతర గేమింగ్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సృజన్‌రెడ్డి హెచ్చరించారు.

## రైతాంగం కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి



**దశ, రామన్నపేట:** రైతుల కోసం జీవితాంతం పోరాడిన గొప్ప రైతు ఉద్యమ నేత సారంపల్లి మల్లారెడ్డి అని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉంచిన సారంపల్లి మల్లారెడ్డి పార్థివదేహాన్ని స్థానిక సీపీఎం నాయకులతో కలిసి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మేక అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల హక్కులు, వ్యవసాయ రంగ పరిరక్షణ, రైతు సమస్యల పరిష్కారం కోసం సారంపల్లి మల్లారెడ్డి జీవితాంతం పోరాడారని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు, నీటి వనరుల వినియోగం, ప్రత్యామ్నాయ పంటలు, గిట్టుబాటు ధరలు, రైతుల ఆర్థిక సమస్యలపై ఆయనకు విశేష అవగాహన ఉండేదన్నారు.

రైతు ఉద్యమాన్ని శాస్త్రీయ దృక్పథంతో ముందుకు తీసుకెళ్లడంలో, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన మరణం రైతు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని, ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని కొనసాగించడమే నిజమైన నివాళి అని అశోక్‌రెడ్డి అన్నారు.

కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, వనం ఉపేందర్, రైతు సంఘం నాయకులు గన్నేబోయిన విజయభాస్కర్, అప్పం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# 80 సంవత్సరాలుగా బీసీలకు అన్యాయం

❖ బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి..



**దశ, ఓయూ:** 80 సంవత్సరాలుగా బీసీలకు అడుగడుగునా అన్యాయం జరిగిందని బిసి కుల సంఘాల జేసి చైర్మన్ కుందారం గణేష్ చారి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బీసీలకు న్యాయం జరగాలని కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద బీపీ మండల్ 109వ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్, మధుసూదనా చారి, జాజుల శ్రీనివాస్ గౌడ్, గుజ్జ కృష్ణ, శ్యాం కుర్మా, కుల్కచర్ల శ్రీనివాస్ తో కలిసి గణేష్ చారి హాజరై మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణేష్ చారి మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం జనగణనలో కుల గణన చేర్చాలని బీసీలకు సపరేట్ కాలం పెట్టాలని కోరారు. బీసీలకు రిజర్వేషన్లు లో తీవ్ర అన్యాయం జరిగిందని ఇప్పటికైనా జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు కల్పించి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తారకేశ్వరి, సోమచారి, బ్రహ్మచారి, వల్లబోజు నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

# వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంని ఆకస్మికంగా తనిఖీ చేసిన వొడితల ప్రణవ్..



**దశ, హుజురాబాద్:** జమ్మికుంట మండల పరిధిలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని మంగళవారం రోజున ఆకస్మికంగా తనిఖీ చేశారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితలప్రణవ్. ఆసుపత్రి వచ్చే రోగులకు వైద్య సేవలు అందుతున్నాయ ఆరా తీశారు.ఆసుపత్రి నిర్వహణపై సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం విద్య,వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు వెళ్తున్నామని,పేదలకు అందించే వైద్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రణవ్ హెచ్చరించారు.దీనిపై జిల్లా కలెక్టర్,సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వావిలాల సర్పంచ్ అర్జున్,మండల అధ్యక్షుడు పరశురామారావు,పొనగటి మల్లయ్య,సారంగపాణి, సజ్జు, జమ్మికుంట,వావిలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# నెల్లిపాకలో ఘనంగా వన మహోత్సవం

❖ మొక్కలు నాటిన సర్పంచ్




**దశ, అశ్వాపురం:** పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా నెల్లిపాక గ్రామ పంచాయతీ పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. నెల్లిపాక గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంతో పాటు గ్రామీణ పశువైద్యశాల ఆవరణలో సర్పంచ్ ముంద్రు వెంకట రామకృష్ణ స్వయంగా మొక్కలు నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రతీ ఒక్కరూ విస్తారంగా చెట్లను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇళ్ల పరిసరాల్లో, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడమే కాకుండా, అవి మహావృక్షాలుగా ఎదిగేంత వరకు సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని కోరారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, కాలుష్య రహిత ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి పౌరుడు ఈ హరిత ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలక మండలి సభ్యులు, స్థానిక జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామీణ పశువైద్యశాల వీఎల్ఎస్, వైద్యారోగ్య శాఖ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, వనసేవక్, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెబ్బేరులో ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

**దశ, పెబ్బేర్:** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో పోచమ్మ తల్లి బోనాల ఉత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. పట్టణవాసులు బోనం కుండలతో ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సంప్రదాయబద్ధంగా బోనం కుండలను నెత్తిన ఎత్తుకుని, మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకుని పోచమ్మ తల్లి ఆశీస్సులు పొందారు. బోనాల ఉత్సవంతో పోచమ్మ దేవాలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో, భక్తుల కోలాహలంతో సందడిగా మారాయి. గత మూడేళ్లుగా పాటిస్తున్న సంప్రదాయం ప్రకారమే ఈసారి కూడా కోళ్లను 'జట్కా' పద్ధతి ద్వారానే అమ్మవారికి సమర్పించినట్లు హిందూ జాగృతం సభ్యులు తెలిపారు. హలాల్ పద్ధతికి బదులుగా జట్కా పద్ధతినే పాటించాలని వారు భక్తులకు సూచించారు. దీనిపై భక్తులకు అవగాహన కల్పించేందుకు పోచమ్మ దేవాలయం వద్ద ప్రత్యేక బ్యానర్లు కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు పట్టణ గ్రామ పెద్దలు, హిందూ జాగృతం ప్రతినిధులు, మహిళలు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

❖ వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ హరి సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది




**దశ, సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట పర్యావరణ పరిరక్షణతో పాటు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ హరి సింగ్, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది లు పిలుపునిచ్చారు. పట్టణంలో నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు కలెక్టర్ హరి సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది లు హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వనమహోత్సవ కార్యక్రమాలను జిల్లాలోని ప్రతి పట్టణం, ప్రతి గ్రామంలో విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో ఎక్కువ సంఖ్యలో చెట్లు పెంచితే వాతావరణంలో సమతుల్యత ఏర్పడి ప్రజలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా పట్టణంలో నీటి ఎద్దడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వర్షపు నీటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి ప్రతి చుక్కను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హనుమాన్ రెడ్డి, వైస్ చైర్మన్ షఫీవుల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు నాగుల వాసు, గండూరి రమేష్, స్థానిక కౌన్సిలర్ కొణతం రాజేష్‌రెడ్డి, ఈఈ కిరణ్, డీఈ ప్రణయ్ రెడ్డి, మేనేజర్ బుచ్చి బాబు ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ యాదగిరి, జూనియర్ అసిస్టెంట్లు అజీముద్దీన్ ఎస్ఎస్ఆర్ ప్రసాద్, వన మహోత్సవం ఇంచార్జ్ లు వసుంధర, వసీం తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు: వేముల వీరేశం



**దశ, రామన్నపేట:** యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట జీఆర్ఎం ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా అర్హులకు రేషన్ కార్డులు మంజూరు కాలేదని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని తెలిపారు. పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని అన్నారు. రామన్నపేట పట్టణంలో అర్హులకు త్వరలో ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాల్ బహదూర్, ఎంపీడీవో రాములు, సింగిల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పున్న జగన్, ఉప సర్పంచ్ మోటే రమేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# హుజురాబాద్ మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

**దశ, హుజురాబాద్:** హుజురాబాద్ మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర రవాణాశాఖ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్,వైస్ చైర్ పర్సన్,కౌన్సిలర్లు.మంగళవారం రోజున సైదాపూర్ మండల పరిధిలోని ఆకునూరు గ్రామంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.సానుకూలంగా స్పందించిన మంత్రి తప్పకుండా నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,వైస్ చైర్ పర్సన్ అంజలి,కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గుడి వెనుక తండాలో మొక్కల నాటే కార్యక్రమం



మాస్ ప్లాంటేషన్‌లో భాగంగా గుడి వెనుక తండా గ్రామపంచాయతీ పరిధిలో పిట్టింగ్, ప్లాంటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామ పెద్దలు పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని గ్రామ ప్రజలకు సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో గ్రామస్తులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# పర్వతగిరి గ్రామపంచాయతీలో మొక్కల నాటకం



పర్వతగిరి గ్రామపంచాయతీ పరిధిలో మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామపంచాయతీ పరిధిలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



## వన మహోత్సవంలో మొక్కల పంపిణీ

వన మహోత్సవంలో భాగంగా సర్పంచ్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు మొక్కలను పంపిణీ చేసి, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.

# శివారు ప్రాంతాలు, మున్సిపాలిటీ విలీన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

❖ స్నేహ నగర్ కాలనీ వాసుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తాం

**దశ సూర్యాపేట ప్రతినిధి :** శివారు ప్రాంతాలు, మున్సిపాలిటీ విలీన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, మున్సిపల్ కమిషనర్ సి.హెచ్. హనుమంత రెడ్డి లు అన్నారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని 14వ వార్డు స్నేహ నగర్ కాలనీలో పర్యటించి కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో శివారు ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వర్షం నీరు ఖాళీ స్థలాలలో నిల్చుడటం వలన దోమలు వస్తుండటంతో, పిల్లలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, త్వరలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మెయిన్ సమస్యను కు పరిష్కరిస్తానని, తాత్కాలికంగా నీటి నిలువ ఉండకుండా ఇరిగేషన్ వారితో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని తెలిపారు. ఖాళీ స్థలం యజమానులకు సమాచారం ఇచ్చి నీళ్లు నిలువ ఉండకుండా శుభ్రం చేసుకోవాలి తెలిపారు. స్నేహ నగర్ కాలనీ వాసుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



# సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



**దశ, నాంపల్లి :** సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని బీజేపీ ఉమ్మడి వరంగల్ జిల్లా కోర్ కమిటీ సమావేశంలో నిర్ణయించారు. తెలంగాణ విమోచన ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బూర నర్సయ్య గౌడ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. విమోచన పోరాట చరిత్రను ప్రజలకు తెలియజేయడంతో పాటు అమరవీరుల త్యాగాలను స్మరించుకునేలా సభలు, నివాళులు, చారిత్రక ప్రదేశాల సందర్శనలు, ప్రజా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. యువత, విద్యార్థులను తెలంగాణ విమోచన చరిత్రతో అనుసంధానం చేసేలా కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించారు. సమావేశంలో నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, మారుతినేని ధర్మారావు, గుజ్జల ప్రేమేందర్ రెడ్డి, మారుతి కిరణ్, సంజయ్ ఘనతే, రావు పద్మ, డా. కాళీ ప్రసాద్, రావు అమరేందర్ రెడ్డి, కొలను సంతోష్ రెడ్డి, గంట రవికుమార్, సౌద రమేష్, నాగం వర్షిత్ రెడ్డి, నెల్లూరు కోటేశ్వరరావు, చాడా శ్రీనివాస్ రెడ్డి, దాస్యం అభినవ్ భాస్కర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భవాని నగర్ సమస్యలపై ప్రభాకర్ పరిశీలన



**దశ ఓయూ:** డివిజన్‌లోని భవాని నగర్ కాలనీలో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ స్పందించారు. సమస్యలపై స్థానికులు దూరవాణి ద్వారా ఆయనకు సమాచారం అందించడంతో వెంటనే కాలనీని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం సంబంధిత ఉన్నతాధికారి డీసీతో ఫోన్‌లో మాట్లాడిన ప్రభాకర్.. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. స్థానికులందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చెంచారం వినోద్‌రెడ్డి, చెంచారం కృష్ణారెడ్డి, అనితారెడ్డి, సత్యలక్ష్మి, విజయ, రాజి, సౌమ్య, సరోజ, మంజు, రమ, లక్ష్మి, వనిత, పద్మ, మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, మంజులవాణి తదితరులు, స్థానిక మహిళలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.